


# ఎత్తుగొలుసు

ఉప్పల అప్పలరాజు

తల దించుకుని గబగబా నడుస్తున్న గురయ్య కళ్ళు మెరిసినట్టయి తక్కిమని ఆగిపోయాడు.

మెరిసిన దానివైపు పరీక్షగా చూశాడు.

* * *

బంగారం! బంగారపు ఎత్తుగొలుసు!!

చటుక్కున దాన్ని చేత్తో తీశాడు.

బాగా కింద మీదా తిరగేసి చూసి. అనుమానం లేదిది బంగారపు ఎత్తుగొలుసే అనుకున్నాడు.

మనసులో ఒక్కసారి ఆనందం చిచ్చుబుడ్డిలా వెలిగింది. కళ్ళల్లో వెర్రిచెలై జ్ఞ కాంతొచ్చింది. అనుకోకుండానే పెదవుల మీద చిరునవ్వు ప్రవహించసాగింది.

బంగారం(వేనా ?

తిరుగులేదిది బంగారవే( అనుకుంటూ ఏదోలా అనిపించి ఒకసారి వెనక్కి తిరిగి చూశాడు.

ఎవరూ కనబల్లేదు. కుడిప్రక్కా ఎడమప్రక్కా కూడా చూశాడు. ఎవరూ ఆ దారివైపు వచ్చేట్టు కనబళ్ళేదు.

'ఇది నాదే-నా సొంతవే(. బగమంతుడు నా బతికి మెచ్చి నా బాదలొదలగొట్టాలనే యిదిచ్చినాడు.' అనుకుని. మనసులోనే దేవుడికో నమస్కారం పెట్టుకుని-ఎత్తుగొలుసు జేబులో దాచుకుని మళ్ళీ నడక ప్రారంభించాడు.

మనసంతా ఆలోచన్లు. ఒక్కసారి మనసంతా శివుడిమీద లగ్నమైపోయింది.

'అవును! నిన్న కార్తీక సోవ్వోర(రం! చాలా మంచిరోజని ఎవరో ఆయవారం కొచ్చిన బ్రాహ్మడు చెబితే తెలిసింది. ఆయనే—"నీ బతుకేం బాగున్నట్టు లేదు నాయనా- ఈ రోజు చాలా మంచిరోజు.తల స్నానంచేసి తిన్నగా శివాలయానికి పోయి ఓ రూపాయి డబ్బులిచ్చి నవదాన్యాలు కొని బ్రాహ్మణులక్కడ కూర్చొ నుంటారు- వారి చేత మరో రూపాయి పెట్టి నీ పేర అభిషేకం చేయించుకున్నావంటే నీ వంటి. ఇంటి దరిద్రం అంతా ఓదిలి పోతుంది. శుభం కలుగుతుంది" అని చెప్పి ఓ అర్ధపావుబియ్యం సంచిలో పోయించుకు వెళ్ళిపోయాడు.

వంతులుగారు చెప్పినట్టు అన్నిరకాల తంతులూ పూర్తిచేసి. తనపేరే కాకుండా తన పెళ్ళాం బంగారమ్మపేర కూడా అభిషేకం చెయ్యించేశాడు. మరో రెండ్రూపాయ లెగస్ట్రా ఖర్చు పెట్టి.'

అయితే వెంటనే ఇంత ఫలితం వొస్తుందని మాత్రం అనుకోలేదు గురయ్య.

'నిన్న అభిషేకం చెయ్యడ(వేటి?(అదే చెయ్యంచడ(వేటి?) ఇయ్యాలింత బంగారం దొరికేద(వేటి?ఇంతం చెంత? అరతులానికో పిసరతక్కువవుతాదేవో(గాని. పావుతులానికి మాతరం ఎక్కువే వుంతాది. ఈస్పురుడెంత గొప్పదేవు(డు!!— అందుకే( గావాల శివరాత్రినాడు రేతిరంతా కునుకు మానీసి పూజిల్జేసేత్తారు.పెతి సోవ్వో(రం అంతంత పైసలు గుప్పెత్తారు. అంతంతంతెంతంత? అనుమంతుడు తోకంతేసి. ఒక్కపాలి నేసినోడికి నాకే యింత బంగారం దొరికినాది గదా మర్రోజూ నేసినోలికి....? దొరకడ(వేటి ఒక్కొక్కిరికి పే....ద్ద ఓడలంతేసి. మేడలున్నాయి— అయ్యన్నీ ఎంత పుణ్ణెం సేసుకుంతే వొచ్చినాయో!' అనుకుంటూ ఇంటికి చేరాడు గురయ్య.

"ఏవ(యింది నువ్వెళ్ళిన వని ?" అని ప్రశ్నించింది భార్య బంగారమ్మ.గుమ్మంలో చతికిలబడ్డ గురయ్యని.

"ఏవ(యిందని అంత నీరసంగా అడుగుతావేటి యెర్రిమొగవా(— పైసా అప్పు సెయ్యకండా సొమ్ము నానే సంపాయించుకొచ్చినాను." అంటూ గంభీరంగా పోజు పెట్టాడు గురయ్య.

"అప్పుసెయ్యనేదంతావు- సంపాయించినా నంతావు. ఏటికతా ? నసమాని తిన్నగ సెప్పరాదా?" అంటూ సస్పెన్సు భరించలేనట్టు ముఖం పెట్టింది బంగారమ్మ.

దీనికి సస్పెన్సుకీ నసకీ తేడా తెలీదని నిర్ధారణ చేసుకున్న గురయ్య జరిగిందంతా వివరంగా చెప్పాడు.

అప్పటిదాకా నీరసంగావున్న బంగారమ్మ ముఖం ఒక్కసారి ఆనందంతో అరవిచ్చిన నల్లటి ముద్దబంతి పువ్వులా తయారయింది. అరముగ్గిన నేరేడువళ్ళలా మెరిసేయి కళ్ళు.

వట్టలేని ఆనందాన్ని బిగబడుతూ—

"బంగారవే(....? నిజవే....? ఏదీ...?"

ఆత్రంగా దగ్గరికి చేరుకుంది బంగారమ్మ.

నెమ్మదిగా కమీజ్జేబిలోంచి గుడ్డమూట విప్పి ఎత్తుగొలుసు తీసి - ఓ చేత్తో బంగారమ్మ చెయ్యి పట్టుకుని. మరో చేత్తో దాన్నామె చేతిలో వేశాడు. పరమానంద భరితురాలై గురయ్య చేతిలోంచి చెయ్యి లాగేసుకుని వెలుగులోకి తిరిగి. అటూ యిటూ త్రిప్పి చూసి సందేహం లేదిది బంగార(వే( అనుకుని—

"బజారుకాడి కంసాలోడికాడి కొట్టు కెల్దావే(టి ?" అంది బంగారమ్మ.

"అడికాడికెల్తే అదంతా కరిగించీసి — ఇది బంగారంకాదు — ఇత్తడ న్సెప్పి — అదాడు దాసీసి— మనకిత్తడిచ్చీసి పొమ్మంతాడు."అన్న మొగుడి ముఖంలోకిచూస్తూ.

"మరయితే దీన్నేటిసేద్దావే(టి ? పెళ్లెట్టి దాసెద్దవా( ?" అనడిగి సమాధానం కోసం చూసున్న బంగారమ్మతో—

"దాసీడ( వెందుకే ? మనబండి బాగు సెయ్యించు కోడానికె బాగా డబ్బులుండాల గదా. ఒకేల సావుకార్నడిగినా బండి మనసేతె విరిగి పోయింది గాబట్టి అప్పే యిత్తాడుగాని తీసుకుని బాగుసెయ్యించుకోరా అనియ్యడుగదా. ఏదో బగమంతు డెట్టా డనుకుందాం" అని.

"రేపు కురపామ్మా రకట్టుకాడికి బంగారం సాపు కొట్టుకెల్దాం" అన్నాడు గురయ్య.

"అమ్మో ఆలకి మనవొ(వురువో( ఏటో తెల్దుగదా— ఇది మీ కెక్కడిదంతే ?" అమాయకంగా అడిగింది బంగారమ్మ.

"మనవే(టి దొంగతనం చేసినావే(టి ?

దొరికిందని సెప్పుతాం" అని ధైర్యం చెప్పేడు గురయ్య.

* * *

పదిగంటలవేళ.

ఎండ పేల్చేస్తోంది.

పెద్ద బంగారం షాపుకు ముందున్న చిన్న షరాబు కొట్టువైపు వెళ్తున్నారు బంగారమ్మ గురయ్యాను. సమర్యాదగా ఆహ్వానిస్తూ "తమకేం కావాలి బాబూ" అంటూ షరాబు కంటే ముందే పలకరించాడు ప్రక్కనున్న ఓ ఆసామి. షరాబుగారితో పనుందంటూ దళారివాడ్ని తప్పించుకుని షరాబుకు ముందుగా వెళ్ళాడు గురయ్య.

"ఏం చెయ్యాలి బాబూ?" అడిగాడు షరాబు.

"సెయ్యడుం కాదండి-మా దగ్గిరో సిన్న వొస్తువుంది. దాన్ని సూసి దరకట్టాల" అంటూ ఎత్తుగొలుసు తీసి షరాబు కిచ్చాడు గురయ్య.

దాన్ని పరీక్షచేస్తూ—

"మరోటి లేదా?" అన్నాడు షరాబు.

"అదొకటేనండి బాబు దొరికింది" అన్నాడు గురయ్య.

గురయ్య ముఖంలో కొకసారి చూసి-గీచేసి చూసి- ఎత్తు గొలుసును తూచి-

"మూడు వందల ముప్పై చిల్లరొస్తాది" అన్నాడు షరాబు.

షరాబు ముఖంకేసి చూసి ఏదో అనుమానం వచ్చి ఎత్తు గొలుసును తీసుకుని-

"మళ్ళీ వత్తాను బాబూ" అంటూ ముందుకు నడిచాడు గురయ్య.

"ఏటీ....అమ్మవా? వొచ్చెత్తున్నావు" అనడిగింది వెంటే వున్న బంగారమ్మ.

"నా కనుమానవేఁత్తందే.... బంగారం దరసూత్తే తులం రెండు వేల్దాకా వుందా— మరిదేవోఁ పావు తులం కెక్కు వుండాల గాని తక్కువుండదగదా.... మనం దొరికిందన్నా వఁనిగాని ఆడలాగ సెప్పినాదేవోఁ? ఇంకొకిలికి సూపిత్తే తేలిపోద్ది కదా!" అంటూ మరో రెండు మూడు కొట్లు దాటి ఓ కొట్టు దగ్గరికెళ్ళి—

"బంగారే.... ఇది మన్దే అని సెప్పి సూత్తే? సినేమాలో ఒకటే పోయిందని సెప్పుదాం" అంటూ పెళ్ళాంకేసి చూశాడు గురయ్య.

నీ యిష్టవేఁ నాయిష్టవఁన్నట్టు తలూపింది బంగారమ్మ. దుకాణానికెదురుగా నిల్చున్న గురయ్యకేసి చూస్తూ—

"ఏం కావాలయ్యా?" అన్నాడు షరాబు.

"ఎత్తుగొలుసుందండీ.... కరీదు కట్టాల"ంటూ షరాబు చేతికిచ్చేడు.

దాన్ని కిందా మీదా తిరగేసి చూసి—

"ఇంకోటేదయ్యా?" అని అనుమానంగా చూస్తూ అడిగాడు షరాబు.

నిన్న తనభార్య సినిమా కెళ్ళినట్టూ అక్కడ లైన్లో ఒకటి పోయినట్టూ ఒక్కటే ఎలాగూ పెట్టుకోంగాబట్టి అమేతస్తున్నట్టూ చెప్పాడు గురయ్య.

భార్యాభర్తలిద్దరి ముఖాల్ని ఓసారి పరీక్షగాచూసి- బంగారాన్ని పరీక్షచేసి— గీచేసి—తూకంవేసి చూసి—లెక్కలుకట్టి— వీళ్ళకి ఉల్లాకెయ్యించడమదీ తెలిసినట్టు లేదని నిర్ధారించుకుని—

"ఆరువందల పాతికొస్తాది" అన్నాడు నెమ్మదిగా ఓ నూట పాతిక తగ్గిస్తూ షరాబు.

"సిత్తం. తవఁరే తీసుకోండి బాబూ. కొన్దర సంగతి మరో మాటనండి" అని అప్పటికీ యిప్పటికీ ఖరీదులో ఎంత తేడా వొచ్చిందో చూడమన్నట్టుగా ఓసారి భార్య ముఖంలోకి చూశాడు గురయ్య.

ఇంతలో మొదట పలకరించిన దళారి వాడొచ్చి ప్రక్కనిలబడ్డాడు. అతడి ముఖంలోకి అప్రయత్నంగా చూశాడు గురయ్య.వెర్రి నవ్వొకటి నవ్వాడు దళారి.

వెంటనే....

"ఏయ్ లెగవోయ్- షరాబుగారూ ఆ ఎత్తు గొలుసు ఇలా యివ్వండి— ఏరా? నీకెక్కడిదిరా యిది? పద స్టేషన్‌కి" అని తోసుకుంటూ ఎంత మొత్తుకున్నా ఏం చెప్పినా వినకుండా ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కి తీసుకుపోయాడు మఫ్టీ పోలీసు.

స్టేషన్లో అడుగు పెట్టగానే—

"ఏంట్రా కేసూ" అన్నారు ఎస్సయిగారు మఫ్టీ పోలీసు నుద్దేశించి.

"దొంగ బంగారవఁమ్ముతుంటే పట్టుకున్నాన్ సార్" అంటూ దగ్గరికెళ్ళి ఎత్తు గొలుసు ఎస్సయిగారి చేతిలో పెట్టి—

"ఓ షాపుదగ్గిర దొరికిందనీ— మరో షాపుదగ్గిర సొంతవఁనీ అన్నారండీ అనుమానవొచ్చి లాక్కొచ్చాను" అని పూర్తి వివరాలిచ్చాడు మఫ్టీపోలీసు.




"ఎక్కడిదోయ్ ఈ ఎత్తు గొలుసు?" అని గురయ్యని ప్రశ్నించారు ఎస్సయిగారు.

తను కిళ్ళీకొట్లకు సోడాలేసుకు బతికేవాడని— షోడాబండి విరిగిపోయిందని- అది బాగుచేయించుకునేందుకు డబ్బవసరమై షోడామిషను హోనరుగారింటికి వెళ్ళాడని - ఆయనా సమయంలో ఇంట్లో లేరని - తిరిగి వస్తున్నపుడు దార్లో యిది దొరికిందనీ — దొరికిందని చెప్తే షరాబు ధర తక్కువ చెప్పేడనీ- అందుకని సొంతవంటే పోలీసు పట్టుకున్నాడనీ - తను దొంగ కాదుగాబట్టి ఒదిలెయ్యమనీ - ఆ బంగారం రోడ్డు మీద దొరికిందిగాబటి తనకిచ్చెయ్యమనీ ఎస్సయిగారితో మనవిచేసుకున్నాడు గురయ్య.

వొదిలి పెట్టమన్న వరకూ శాంతంగా విన్న ఎస్సయిగారు బంగారం ఇచ్చెయ్యమనగానే—

"ఒరేయ్! ఈడ్ని తీసికెళ్ళి ఆ లాకప్ లెయ్యండ్రా — దాన్నామూల కూర్చోమనండి" అని పోలీసులకో ఆర్డరేశారు.

దాన్తో గురయ్య రెక్క పట్టుకుని ఈడ్చుకుపోతున్న పోలీసుతో—

"బాబూ నా మాటినండి. నాన్దొంగని కాను. బంగారం తీసుకొని నన్నొదిలీండి" అంటూ మొరపెట్టుకోబోతే-

"నోర్ముయ్; దొంగనాకొడకా నీ...." అంటూ ఓ పోలీస్ తిట్టుతిట్టి కొత్తమీద "ఫెడేల్ ఫెడేల్" మనిరెండేసి లాకప్‌లోకి తోసి లాక్‌చేశాడు పోలీసు.

ఆ దృశ్యం చూసిన బంగారమ్మ రాగం తీస్తూ ఏడుపు మొదలెట్టింది. పోలీసులు తిట్లతో ఆమె నేడుపు మానిపించలేక పోయారు.

* * *

రాత్రి ఎనిమిది గంటలు కావస్తుంది.

ఆడదాన్ని రాత్రి స్టేషన్లో వుంచకూడదని గాబోలు-

"ఒరేయ్! దాన్ని పంపించేసి ఉదయం రమ్మనండి" అన్నారు ఎస్సయిగారు.

ఆ మాటమీద బంగారమ్మ నొదిలేశారు పోలీసులు.

గబగబా నడుచుకుంటూ అరగంటలో షావుకారు గారింటికెళ్ళి జరిగిందంతా ఏడ్చుకుంటూ చెప్పి- ఎలాగైనా తన భర్తని స్టేషన్నుంచి విడిపించమని బతిమిలాడుకుంది బంగారమ్మ.

షావుకారుగారో పది నిమిషాలాలోచించి ఓ క్రైమ్‌బ్రాంచ్ కానిస్టేబుల్‌ని మనసులోకి తెచ్చుకుని-

"నాతో రావే.... అంటూ పైమీద తువ్వాలేసుకుని వున్నపళంగా బయల్దేరారు.

రెండోసందులో ఓ పెంకుటింటిముందాగి "తాతినాయ్యో.... తాతినాయ్యో...."అని

పిలిచేసరికి తలుపు తెరచుకొచ్చాడు తాతి నాయుడు.

"నమస్కారం సార్! ఏటిలా వచ్చారు?" అంటూ కూర్చోమని ఓ స్టూలు వేశాడు వరండాలో.

"దండాలు బాబూ" వరండాలోకొచ్చింది బంగారమ్మ.

తాతినాయుడిని చూసేసరికి గుండెనిండా ఆనందం పొంగుకొచ్చింది. సాక్షాత్తూ ఆ పోలీసే ఉదయం తమని పట్టుకున్న పోలీసు అని నిర్ధారణ చేసుకున్న తరువాత కొంత ధైర్యం వచ్చింది బంగారమ్మకి.


ఆమెని చూసేసరికి ఆశ్చర్యం ఆనందం రెండూ మిళితమయ్యాయి తాతినాయుడికి. కేసర్థమై పోయింది. షావుకారుగారు చెప్పిందంతా విని సరే అలాగే గురయ్యని విడిపిస్తానని చెప్పి, బంగారమ్మ నక్కడుండమని షావుకారుగార్ని వెళ్ళమన్నాడు.

భార్యను పిలిచి పాపం ఉదయంనుంచీ ఏవీ తిన్నట్టులేదు కాస్త అన్నమో గెంజో పొయ్యమని చెప్పి ఎంత మొహమాటపడినా ఆమెచేత అన్నం తినిపించాడు తాతినాయుడు

నెమ్మదిగా బిడియపడుతూ తింటున్న బంగారమ్మ నుద్దేశించి.

"నీకేసు చూస్తే దొంగ కేసని రాసేశారు- ఇప్పుడు విడిపించడమంటే మాటల్తో పనికాదు. మరేంలేదు నాలాటోడు చెప్తే- నువ్వే పట్టుకుపి నువ్వే వొదిలెయ్యమంటున్నావంటే ఇందులో ఏదో మతలబు వుందనేస్తారు చటుక్కని- నేనసలే మాటంటే పడని మనిషినీ-ప్రాణం పోయినా సహిస్తానుగాని, మాట పోతే మాత్రం సహించను. నేనేగాని లంచాలు తీసుకునే వోడ్నయితే ఇంత చిన్న పెంకుటిల్లా కట్టించుకుంటాను చెప్పు" అని ఆగి బంగారమ్మ ముఖంలో కొకసారి చూసి మళ్ళీ-

"మరి షావుకారుగారు చెప్పేరు గాబట్టి తప్పదనుకో- పైగా నీ పేద పరిస్థితి చూస్తుంటే నాకూ జాలిగానే వుంది- ఎవరి తోటో ఒకరి తోటి ఆ ఎస్సయిగారికి ఓ వందో యాభయ్యో యిప్పించేసి ఆపైన్నేను చెప్తే అయిపోద్దనుకో- అయినా నువ్వు మాత్రం ఎక్కడ్నుంచి తెస్తావంత డబ్బు — ఆ ఎస్సయి నాకొడుకు పరమ కసాయినాకొడుకు. అడి దగ్గర పని జరగాలంటే డబ్బేగాని మాటలు పన్జెయ్యవు. సరే ఆలోచిద్దాం గాని పొద్దున్నెనిమిది గంటలకల్లా ఓ యాభై రూపాయి లెక్కడైనా సంపాయించి పట్రా - అప్పటికి నేను స్నానంచేసి రెడీగుంటాను" అంటూ బంగారమ్మ వంక చూడకుండానే లోపలికి వెళ్ళిపోయాడు.




విడిపిస్తాననగానే తేలిక పడ్డ మనసు యాభై రూపాయిలనగానే మళ్ళీ రెట్టింపు బరువయ్యింది బంగారమ్మకి.

డబ్బు లేదు. లేదన్చెబితే గురయ్య బయటికి రాడు. బయటికి రాకపోతే 'అమ్మో నా మొగుడ్ని సంపెత్తారు' అనుకుంది.

బల్లమీదనుంచి పళ్ళెం పడిపోయి ఇంట్లో ఘల్లుమని శబ్దం అయింది. ఆలోచిస్తూ కూర్చున్న బంగారమ్మ మనసులో తన పెళ్ళినాటి రెండు కంచుగిన్నెలూ కదిలినట్లయింది.

గబగబా చెయ్యి కడుక్కుని లేచి, గిన్నె వరండాలోపెట్టి గదిలోంచి బయటికొస్తున్న పోలీసుతో—

"తెత్తాను బాబూ.... ఓ పిటవాఁలిసివఁయినా వుండండి బాబూ" అన్చెప్పి వెళ్ళిపోయింది బంగారమ్మ.

వెళ్ళిపోతున్న బంగారమ్మను చూస్తున్న తాతినాయుడి కళ్ళలో బంగారం కదలాడ సాగింది.

'ఇరవై నాలుగ్గంటలు పోతే గురయ్య నొదిలేస్తారు పది పదిహేను రోజుల్లో ఏ కంప్లెయింటూ రాకపోతే బంగారఁవమ్మేసుకుంటారు. అమ్ముకున్నపుడు ఎస్సయితనకి వాటా యిస్తాడా? ఏమో దొంగనాకొడుకు యివ్వకపోయినా అడ్డగలేం కదాని ఆడే అమ్ముకు తినేస్తాడు. అయినా నా వాటా నాకు దొరికి పోతుందిగదా....' అనుకుని తలుపు మూసుకుని లోపలికి పోయాడు.

* * *

దొరికిన బంగారం-రోజున్నర భోజనం- రెండు కంచు గిన్నెలూ వదలి పోయిన తరువాత ‘బతుకుజీవుడా’ని లాకప్‌నుంచి బయట పడ్డాడు గురయ్య.

సమయం పన్నెండు కావస్తుంది. ఎండకి పెనంలా రోడ్డు కాల్తూంది బస్సెక్కి పోవాలని పించింది. అందుకూడా మనస్కరించక నడకారంభించాడు గురయ్య. తిండి లేక నీరసించి పోయిన గురయ్య నెమ్మదిగా నడుస్తుంటే తిరిగి నీరసించిన బంగారమ్మ వెంటే నడుస్తూంది.

నెమ్మదిగా నడుస్తూ బంగారం షాపుల దగ్గర కొచ్చేసరికి మెడనిండా ఓ కేజీ బంగారంతో మెట్లుదిగుతున్న ఓ స్థూలకాయం కనిపించింది గురయ్యకి — గురయ్య మనసు ఆలోచన్లో పడింది.

తనింత శిక్ష అనుభవించేందుకు చేసిన తప్పేవిఁటో అర్థంకాలేదు. బంగారం దొరకడం తప్పో — దొరికిన బంగారం అమ్మడం తప్పో అర్థమవడంలేదు. సొంతదని చెప్పడమే తప్పయితే- మరి దొరికిందనగానే ఆరొందల ఖరీదయిన వస్తువుకి మూడొందలు ధర చెప్పిన షరాబునేమీ అనలేదేం? అంతా అయోమయంగా కనిపిస్తోంది గురయ్యకి.

అలా...నడుస్తూ పూర్ణామార్కెట్టు దాటేసరికి- కోడిపిల్లలకోసం చూస్తున్న గద్దలా చూస్తూ పోలీస్ ఇనస్పెక్టరు స్కూటర్ మీద వెళ్తూ కనబడేసరికి గురయ్య చూపటు మళ్ళింది. గురయ్యకి జరిగినది అంతా తిరకాసుగా అగుపిస్తోంది.

నడుస్తున్నవాడల్లా ఆగిపోయి పక్కకి చూశాడు. బంగారమ్మ లేదు. రోడ్డు కిరువైపులా చూశాడు. శివాలయపు దావరానికి రెండుచేతులూ అన్చి నమస్కరిస్తూ కనబడింది బంగారమ్మ.

"ప్చ్" అని పెదవి విరిచి, అప్రయత్నంగా ముందుకు తిరిగి నెమ్మదిగా ముందుకడుగేశాడు గురయ్య. ●